సాక్షి
జోగులాంబ గద్వాల

శుక్రవారం : 10 : నవంబర్ : 2023



నాడు వైభవం..
సంస్థానం, తాలూకాగా వెలుగొందిన ఆత్మకూర్ ప్రస్తుతం దయనీయంగా మారింది.

వివరాలు IIలో ▸



నేటి నుంచి హ్యాండ్‌బాల్ టోర్నీ
పాలమూరులో శుక్రవారం నుంచి రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ టోర్నీ నిర్వహించనున్నారు.

వివరాలు IIలో ▸

వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం
30.2 /20.4

రోజంతా ఆకాశం సాధారణంగా ఉంటుంది. మధ్యాహ్నం తర్వాత మేఘావృతం అవుతుంది. అర్ధరాత్రి చలి తీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

అందుబాటులో ఉచిత న్యాయ సేవలు



గద్వాల క్రైం: ప్రతి పౌరుడికి ఉచిత న్యాయ సేవలను అందించాలనే లక్ష్యంతో లీగల్ సర్వీస్ అథారిటీస్ యాక్ట్ అమల్లోకి వచ్చిందని జిల్లా జడ్జి కుషా అన్నారు. గురువారం లీగల్ సర్వీస్ డే సందర్భంగా కోర్టు ఆవరణలో జాతీయ లీగల్ సర్వీస్ డే కార్యక్రమాన్ని నిర్వహించగా ఆయన హాజరై మాట్లాడారు. సమస్యలు వచ్చినప్పుడు కోర్టు ద్వారా పరిష్కారం చేసుకునే క్రమంలో లాయర్లకు ఫీజులు చెల్లించలేని వారికి లీగల్ సర్వీస్ చేయూత అందిస్తుందన్నారు. ఉచితంగా న్యాయం పొందగలిగే విధానాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని, మహిళలు, పిల్లలు, లైంగిక దాడులు, కిడ్నాప్, వరకట్న వేధింపులు, మానసిక - శారీరక హింస మొదలైన వాటి నుంచి న్యాయం పొందడానికి లీగల్ సర్వీస్ సెల్‌ను ఆశ్రయించవచ్చన్నారు. ప్రస్తుతం యువత చెడు వ్యసనాలకు ఆకర్షితులవుతున్నారని, ఈ క్రమంలో పాఠశాల, కళాశాల యాజమాన్యులతో లీగల్ అవేర్‌నెస్ కార్యక్రమాలు సైతం చేపట్టామన్నారు. చట్ట పరిధిలోని ప్రతి సమస్యలకు ఉచితంగా న్యాయం అందించడమే లీగల్ సర్వీస్ డే ఉద్దేశ్యమన్నారు. కార్యక్రమంలో జడ్జిలు కవిత, ఉదయ్‌నాయక్ కోర్టు సిబ్బంది, బార్ అసోసియేషన్ సభ్యులు ఉన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

అలంపూర్: అట్టడుగు, వెనకబడిన పేదలకు ఉచిత న్యాయ సహాయం అందించడమే నేషనల్ లీగల్ సర్వీస్ అథారిటీ లక్ష్యమని, ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జూనియర్ సివిల్ కోర్టు జడ్జి కమలాపురం కవిత అన్నారు. అలంపూర్‌లో నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ డే గురువారం నిర్వహించారు.ఈ సమావేశానికి జడ్జి కమలాపురం కవిత ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతి ఏడాది నవంబర్ 9వ తేదిన నేషనల్ లీగల్ సర్వీసెస్ డేను నిర్వహించడం జరుగుతుందన్నారు. నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీతో వెనకబడిన పేద, అట్టడుగు వర్గాలకు ఉచిత న్యాయం, న్యాయ సేవలను అందించడం ముఖ్య ఉద్దేశమన్నారు. రాజ్యాంగంలో పొందుపర్చిన సమానత్వం, సామాజిక న్యాయం ప్రాథమిక సూత్రాలను సమర్థిస్తుందన్నారు. కొందరికి న్యాయం ప్రత్యేక హక్కుగా కాకుండా అందరికి సమానమైన హక్కుగా వర్తిస్తోందన్నారు. కార్యక్రమంలో ఏజీపీ నరసింహులు, న్యాయవాదులు రాజేశ్వరి, సురేష్ కుమార్, తిమ్మారెడ్డి, శ్రీనివాసులు, అంజనేయులు, కిషన్ రావు, సాయితేజ ఉన్నారు.

నామినేషన్లు, ర్యాలీల జోరు

- తుది దశకు చేరిన పర్వం
- ఏకాదశి వేళ సెంటర్లకు పోటెత్తిన అభ్యర్థులు
- ఒక్క రోజులోనే 87 నామినేషన్లు దాఖలు
- భారీ ర్యాలీలతో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ శ్రేణుల సందడి
- అలంపూర్ అభ్యర్థిని ప్రకటించని బీజేపీ
- అయినా పార్టీ నుంచి నామినేషన్లు వేసిన పలువురు
- నేటితో ముగియనున్న గడువు



అలంపూర్‌లో నామినేషన్ దాఖలు చేస్తున్న విజేయుడు

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్:

అసెంబ్లీ ఎన్నికల వేళ నామినేషన్ల పర్వం ఊపందుకుంది. గురువారం ఏకాదశి మంచి రోజు కావడం, ముందస్తుగా నిర్ణయించుకున్న మేరకు ఆయా పార్టీలతో పాటు రెబల్స్, స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్ సెంటర్లకు పోటెత్తారు. ఈ సందర్భంగా ఆయా నియోజకవర్గ కేంద్రాలు ర్యాలీలు, నినాదాలతో హోరెత్తాయి. షెడ్యూల్ ప్రకారం శుక్రవారంతో నామినేషన్ల దాఖలు గడువు ముగియనుండగా.. ప్రధాన పార్టీలకు చెందిన అభ్యర్థులందరూ నామినేషన్ల తంతు పూర్తి చేశారు. బీజేపీకి సంబంధించి అలంపూర్, దేవరకద్ర అభ్యర్థులను ఇంకా ఖరారు చేయలేదు. కానీ ఆ పార్టీకి చెందిన పలువురు ఆయా సెగ్మెంట్ల నుంచి నామినేషన్లు వేశారు. వీరిలో ఎవరికి టికెట్ ఇస్తారు లేక మరెవరికైనా ఖరారు చేస్తారా అనే అంశం ఆ పార్టీలో హాట్ టాపిక్‌గా మారింది.



నియోజకవర్గాల వారీగా గురువారం నామినేషన్ల వివరాలు..

మహబూబ్‌నగర్	జడ్చర్ల	దేవరకద్ర
8	4	4

నారాయణపేట	మక్తల్	వనపర్తి	గద్వాల	అలంపూర్
3	4	9	8	10

నాగర్‌కర్నూల్	అచ్చంపేట	కల్వకుర్తి	కొల్లాపూర్	కొడంగల్
7	10	8	8	4

నినాదాల హోరు

- మహబూబ్‌నగర్‌లో బీఆర్‌ఎస్ అభ్యర్థి, మంత్రి నామినేషన్ సందర్భంగా పట్టణంలో నిర్వహించిన ర్యాలీ జనసంద్రంగా మారింది. న్యూటౌన్ నుంచి బస్టాండ్ మీదుగా తెలంగాణ చౌరస్తా వరకు ర్యాలీ సాగింది. మంత్రి తన కూతురు, కుటుంబసభ్యులతో కలిసి రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు సమర్పించారు.
- దేవరకద్రలో బీఆర్‌ఎస్ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి తన తల్లి వరలక్ష్మి, భార్య మంజుల, కూతుళ్లు, ఇతర కుటుంబ సభ్యులతోపాటు వేలాది మంది కార్యకర్తలతో భారీ ర్యాలీగా నామినేషన్ దాఖలు చేశారు. మహబూబ్‌నగర్ రోడ్డులోని భారత్ పెట్రోల్ బంక్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి రిటర్నింగ్ అధికారికి నామినేషన్‌పత్రాలు సమర్పించారు.
- జడ్చర్లలో బీఆర్‌ఎస్ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ప్రేమ్ రంగా గార్డెన్ నుంచి వేలాది మంది పార్టీ శ్రేణులతో కలిసి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు.
- కొల్లాపూర్‌లో బీజేపీ అభ్యర్థి ఎల్లేని సుధాకర్‌రావు పార్టీ కార్యాలయం నుంచి.. కాంగ్రెస్ అభ్యర్థి జూపల్లి కృష్ణారావు జగ్జీవన్‌రాం చౌరస్తా నుంచి వేర్వేరుగా ర్యాలీ నిర్వహిస్తూ రిటర్నింగ్ అధికారి కార్యాలయం వరకు చేరుకున్నారు.
- అలంపూర్‌లో బీఎస్పీ అభ్యర్థి ప్రసన్న కుమార్ అలంపూర్ మున్సిపాలిటీలోని న్యూప్లాట్స్ కాలనీ నుంచి ఆర్వో కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు.
- వనపర్తిలో నామినేషన్ సందర్భంగా బీఆర్‌ఎస్ అభ్యర్థి, మంత్రి నిరంజన్‌రెడ్డి అంబేద్కర్ చౌరస్తా నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. రాజీవ్‌చౌక్‌లో కార్యకర్తలనుద్దేశించి మాట్లాడారు.
- అచ్చంపేటలో కాంగ్రెస్ అభ్యర్థి చిక్కుడ వంశీకృష్ణ వేలాది మంది అనుచరులతో పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించి నామినేషన్ దాఖలు చేశారు.

గురువారం ఎక్కడెక్కడ, ఎలా అంటే..

మహబూబ్‌నగర్ జిల్లా

మహబూబ్‌నగర్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి మంత్రి శ్రీనివాస్‌గౌడ్, మున్నూరు రవి (బీఆర్‌ఎస్ రెబల్), ఎంఏ ఖాదర్ (ప్రగతిశీల సమాజ్ పార్టీ), టి.కృష్ణ (భారత చైతన్య యువజన పార్టీ), కె.రాములు (ధర్మసమాజ్ పార్టీ), స్వతంత్ర అభ్యర్థులుగా అశోక్ కుమార్ గజ్‌బింకర్, కారకొండ శ్రీనివాసులు, మహమ్మద్ షరీఫ్ నామినేషన్లు దాఖలు చేశారు. దేవరకద్రలో బీఆర్‌ఎస్ అభ్యర్థిగా సిట్టింగ్‌ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, కతలయ్య(విద్యార్థుల రాజకీయ అనుబంధ పార్టీ), ఎల్లప్ప (ప్రజాఏక్తా పార్టీ), బండ మధుసూదన్‌రెడ్డి (జన శంఖారావం) నామినేషన్లు వేశారు. జడ్చర్ల సెగ్మెంట్‌లో బీఆర్‌ఎస్ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే సి.లక్ష్మారెడ్డి, స్వతంత్రులుగా కోస్గి వెంకటయ్య, మోహన్, శ్రీకాంత్ (బీసీవై) నామినేషన్లు దాఖలు చేశారు.

గద్వాల జిల్లా

గద్వాలలో బీఆర్‌ఎస్ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి తరఫున ఆయన భార్య జ్యోతి, బోయ శివారెడ్డి (బీజేపీ), ఆతికూర్ రహమాన్ (బీఎస్పీ), గొంగళ్ల రంజిత్ కుమార్ (ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్), కృష్ణ (భారతీయ స్వదేశీ కాంగ్రెస్), స్వతంత్ర అభ్యర్థులుగా వెంకటేష్ నాయక్, ఉప్పరి కృష్ణ ఒక సెట్ వేశారు. అలంపూర్ సెగ్మెంట్‌లో విజయుడు (బీఆర్‌ఎస్), బంగి లక్ష్మణ్ (బీజేపీ), మల్లయ్య(బీజేపీ), మేరమ్మ (బీజేపీ), లింగన్న (ఏఐఎఫ్‌బీ), కేశవులు (బీఎస్పీ), ఆర్‌ఎస్ ప్రసన్న కుమార్ (బీఎస్పీ), స్వతంత్రులుగా మాదన్న, ప్రేమలత, బీసన్న నామినేషన్ దాఖలు చేశారు.

నాగర్‌కర్నూల్ జిల్లా

నాగర్‌కర్నూల్‌లో కాంగ్రెస్ నుంచి కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి, కొత్తపల్లి కుమార్ (బీఎస్పీ), స్వతంత్రులుగా వడ్డే శివకృష్ణ, ముకేశ్, మిద్దె రాములు, కె.జానకిరాములు (అలియన్స్ ఆఫ్ డెమొక్రటిక్ రిఫామ్స్) గద్దం విజయ్ కుమార్ (బహుజన్ ముక్తి) నామినేషన్లు వేశారు. కొల్లాపూర్‌లో ఎల్లేని సుధాకర్‌రావు (బీజేపీ), జూపల్లి కృష్ణారావు (కాంగ్రెస్), సిట్టింగ్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి భార్య విజయ, కాటగొని తిరుపతమ్మ (బీసీవై), బింగి సాయన్న (బహుజన శక్తి), గొంతి విక్రమ్ (సమైక్యాంధ్ర పరిరక్షణ సమితి), నేనావత్ శివుడు (నవరంగ్ కాంగ్రెస్), కరనే శిరీష (స్వతంత్ర) నామినేషన్లు దాఖలు చేశారు. కల్వకుర్తిలో తల్లోజు ఆచారి (బీజేపీ), శ్రీనివాసులు (బీఎస్పీ), రమేష్ (ధర్మ సమాజ్), జంగయ్య (ప్రజాశాంతి), ఖురియాలు (మన సురక్ష పార్టీ), స్వతంత్రులుగా యాదమ్మ, పాండురంగయ్య, అంజనేయులు నామినేషన్లు వేశారు. అచ్చంపేటలో బీఆర్‌ఎస్ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు తరఫున ఆయన సతీమణి అమల, కాంగ్రెస్ అభ్యర్థి, డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ వంశీకృష్ణ, ఆయన సతీమణి అనురాధతో పాటు సతీష్ (బీజేపీ), కొండపల్లి రాములు (బహుజన్ ముక్తి), చింతసాయిబాబు (ధర్మ సమాజ్), స్వతంత్రులుగా వెంకటేష్, రవి, జి.రాజు, చారగొండ కృష్ణమ్మ నామినేషన్లు వేశారు.



గద్వాలలో నామినేషన్ దాఖలు చేస్తున్న బండ్ల జ్యోతి

నారాయణపేట జిల్లా

నారాయణపేటలో బీఆర్‌ఎస్ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి, ధర్మ సమాజ్ నుంచి ఈశ్వర్, స్వతంత్ర అభ్యర్థిగా సత్యనారాయణ బండ నామినేషన్లు దాఖలు చేశారు. కొడంగల్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి, ముగ్గురు స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేశారు. మక్తల్‌లో చిట్టెం రామ్మోహన్‌రెడ్డి 9బీఆర్‌ఎస్, శ్రీహరి(కాంగ్రెస్)తరుపున మాన్యే రామారావు, వర్కటం జగన్నాథం (బీఎస్పీ), వెంకట్‌రామ్‌రెడ్డి (ఫార్వర్డ్ బ్లాక్)నుంచి నామినేషన్‌లు దాఖలు చేశారు.

వనపర్తి జిల్లా

వనపర్తి నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి, మంత్రి నిరంజన్‌రెడ్డితో పాటు స్వతంత్ర అభ్యర్థులుగా ముగ్గురు, ప్రజా ఏక్తా పార్టీ, అలయన్స్ ఆఫ్ డెమోక్రటిక్, బీఎస్పీ, డీఎస్పీ, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా నుంచి ఒక్కో సెట్ చొప్పున నామినేషన్లు దాఖలు చేశారు.

తొలి ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి



కంప్యూటర్‌లో వివరాలు పరిశీలిస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

గద్వాల రూరల్: శాసనసభ ఎన్నికలకు సంబంధించి ఎన్నికల అధికారులకు తొలిర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తయినట్లు కలెక్టర్ వల్లూరు క్రాంతి తెలిపారు. గురువారం ఐడీవోసీ కార్యాలయంలో పీవో, ఏపీవో, పోలింగ్ సిబ్బందికి పోలింగ్ ప్రక్రియపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా గద్వాల, అలంపూర్ నియోజకవర్గాల పరిధిలో సిబ్బందికి కేటాయించిన వివరాలను తెలియజేశారు. అదేవిధంగా ఎన్నికలను పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించేలా టోల్‌ఫ్రీ నంబర్ 1950, సి-విజిల్ యాప్, కంట్రోల్‌రూం సిబ్బంది 24గంటల పాటు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. అదనపు కలెక్టర్ చీర్ల శ్రీనివాసులు, సీపీవో లక్ష్మణ్, ఈడీఎం శివకుమార్ పాల్గొన్నారు.

బాలల హక్కులను పరిరక్షించాలి



గట్టు: బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత అని బాలల సంరక్షణ జిల్లా కోఆర్డినేటర్ లక్ష్మీదేవి, చైల్డ్ లైన్ సూపర్‌వైజర్ దస్తగిరి తెలిపారు. గురువారం గట్టులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మహిళా శిశు సంక్షేమ శాఖ, బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా లక్ష్మీదేవి, దస్తగిరి మాట్లాడుతూ బాల కార్మికుల్లేని సమాజాన్ని సృష్టిద్దామన్నారు. వేధింపుల బారి నుంచి రక్షణ కల్పించడం జరుగుతుందన్నారు. బాల్య వివాహాలను ఎట్టి పరిస్థితుల్లో జరగకుండా అడ్డుకుందామన్నారు. 18 ఏళ్లలోపు బాలికలు ఎటువంటి సమస్యలు ఎదుర్కొన్నా చైల్డ్ లైన్ సహాయం కోసం కాల్ చేయాలన్నారు. టోల్ ఫ్రీ నం.1098, 100, 181కు కాల్ చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శేఖర్‌రెడ్డి, లెక్చరర్ కేపీడీ రాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఓటే.. వజ్రాయుధం

ప్రలోభాలకు లొంగవద్దు

- ఓటును సరైన రీతిలో వినియోగిస్తే ప్రజాస్వామ్యానికి రక్షణ కవచం
- గ్రూప్స్, ఎంసెట్ పేపర్ల లీకేజీలతో యువత భవిష్యత్ అస్తవ్యస్తం
- విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే వారికే పట్టం
- 'సాక్షి' చర్చా వేదికలో యువ ఓటర్ల మనోగతం



గద్వాలలోని నవోదయ మహిళా డిగ్రీ కళాశాలలో యువ ఓటర్లు

గద్వాల రూరల్: ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం లాంటిదని, ఓటు హక్కును సరైన రీతిలో వినియోగించుకుంటేనే ప్రజాస్వామ్యం పరిరక్షించబడుతుందని యువ ఓటర్లు అభిప్రాయ పడ్డారు. గురువారం 'సాక్షి' ఆధ్వర్యంలో గద్వాల నవోదయ మహిళా డిగ్రీ కళాశాలలో యువతతో చర్చావేదిక నిర్వహించింది. ఈ సందర్భంగా కొత్తగా ఓటు హక్కు పొందిన యువత పలు ఆసక్తికరమైన అంశాలను పంచుకున్నారు. ఇటీవల గ్రూప్స్ పేపర్స్ లీకేజీ, ఎంసెట్ పేపర్ లీకేజీ వంటి యువత భవిష్యత్తును నిర్దేశించే పోటీ పరీక్షలన్నీ కూడా లీకేజీల పేరిట రద్దవుతూ.. వాయిదాలు పడుతూ అస్తవ్యస్తంగా మారాయని అభిప్రాయపడ్డారు. యువతకు అవసరమైన విద్య, ఉపాధి, నైపుణ్యత వంటి అంశాల గురించి ఆలోచించే నాయకుడు, ప్రభుత్వాలు లేకపోవడం శోచనీయమన్నారు. డిగ్రీ తరువాత ఏదైన ఉద్యోగం కోసం శిక్షణకు వెళ్లాలంటే హైదరాబాద్, మహబూబ్‌నగర్ వంటి సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని, అక్కడ రూ.వేలకు వేలు ఫీజులు కట్టి ఇబ్బందులు పడుతూ కష్టపడి చదివితే ఆ పరీక్షలు లీకేజీలు, ఇతరత్రా కారణాల చేత వాయిదాలు, రద్దు అవుతుండడం మాలాంటి రాబోయే తరానికి నిజంగా ఆందోళన కలిగించే అంశమని అన్నారు. మార్పు రావాలంటే పని చేసి, అందుబాటులో ఉండే నాయకులను ఎన్నుకోవాలని.. కానుకలు, ఇతర ప్రలోభాలకు లోనుకాకుండా స్వేచ్ఛగా సమర్థవంతమైన అభ్యర్థికి ఓటు వేస్తే ప్రజాస్వామ్యం పరిరక్షించబడుతుందన్నారు. ఈక్రమంలోనే మొదటి సారి ఓటు హక్కు వినియోగించుకోబోతున్న తాము ఎంతో ఉత్సాహంగా ఉన్నామని తెలిపారు. వారి అభిప్రాయాలు వారి మాటల్లోనే..

సరైన నేతను ఎన్నుకోవాలి



సరైన నేతను ఎన్నుకుంటేనే మన ప్రాంతానికి మేలు అభివృద్ధి జరుగుతుంది. మొదటి సారి ఓటు హక్కు వచ్చింది. తొలిసారిగా ఓటుహక్కును వినియోగించుకునేందుకు ఉత్సాహంతో ఉన్నాను. ప్రధానంగా యువతకు పెద్దపీట వేసే నాయకత్వానికి మద్దతు తెలుపుతాం.

– శృతి, బీఎస్సీ ఎంపీసీఎస్, ఫైనల్ ఇయర్

ఉద్యోగ అవకాశాలు కల్పించాలి



ప్రస్తుత ప్రభుత్వాలు వృద్ధులకు అత్యధికంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాయి. యువతకు ఎలాంటి పథకాలను రూపొందించడం లేదు. దీంతో యువతకు సరైన ఉపాధి లభించకపోవడంతో ఉద్యోగాలు లేక నిరుద్యోగులుగా మారుతున్నారు. ఈ పరిస్థితి మారాలంటే యువతకు విద్య, ఉపాధికి అవసరమైన నైపుణ్యం పెంపొందించే కార్యక్రమాలు నిరంతరాయంగా చేపట్టాలి.

– భవాని, డిగ్రీ సెకండియర్

రవాణా సౌకర్యం లేదు



మా గ్రామానికి సరైన బస్సు సౌకర్యం, రోడ్డు సౌకర్యం లేదు. దీంతో చదువుకునేందుకు గద్వాలకు రావాలంటే తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నాం. ఈ సమస్యపై గతంలో అధికారుల దృష్టికి, స్థానికంగా ఉన్న మా నాయకుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం చూపలేదు. అందుకే మాకు అందుబాటులో ఉండి పరిష్కరించే నాయకుడికి మాత్రమే ఎన్నుకుంటాం. ఎలాంటి ప్రలోభాలకు తలొగ్గాం.

– రేవతి, డిగ్రీ ఫస్టియర్

మౌళిక వసతులు కరువు



గ్రామాల్లో నేటికీ కనీస అవసరాలైన తాగునీరు, డ్రెయినేజీ వ్యవస్థ, విద్యుత్ సమస్య, సీసీ రోడ్లు వంటివి ఇంకా అధ్వానంగా ఉన్నాయి. ఈ పరిస్థితి మారాలంటే పని చేసే నాయకత్వాన్ని ఎన్నుకోవాలి. ముఖ్యంగా ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా ఓటును వినియోగించుకునేంటేనే సాధ్యపడుతుంది.

– వనిత, బీఎస్సీ బీజెడ్సీ, ఫస్టియర్

అమ్మానాన్నకు వివరిస్తా



తొలిసారి ఓటుహక్కు వచ్చింది. ఈ సారి ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను. ఓటు విలువ గురించి మా ఇంట్లో తల్లిదండ్రులకు తెలియజేస్తాను. ఎలాంటి ప్రలోభాలకు తలొగ్గకుండా స్వేచ్ఛాయుతంగా ఓటును వినియోగించుకునేలా నా వంతు కృషి చేస్తా.

– గంగోత్రి, బీఎస్సీ సెకండియర్

అవగాహన అవసరం



ప్రజాస్వామ్యంలో ఓటు ప్రాధాన్యతపై చాలా మందికి అవగాహన లేదు. ఓటు విలువ, వినియోగం, అభ్యర్థుల గురించి ప్రత్యేకంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తే బాగుంటుంది. కేవలం టీవీలు, రేడియోలు, పత్రికల ద్వారా కాకుండా నిపుణుల చేత అవగాహన కల్పిస్తే మెరుగైన సమాజానికి దోహదం చేస్తోంది.

– ఉమేరా, బీఎస్సీ ఎంపీసీఎస్ ఫైనలియర్

అందుబాటులో ఉండాలి



మనం ఓట్లు వేస్తే గెలిచే నాయకులు మనకు నిత్యం అందుబాటులో ఉండి మన ప్రాంత అభివృద్ధికి, నెలకొన్న సమస్యలకు పరిష్కారం చూపేలా ఉండాలి. అలాంటి నాయకులను ఎన్నుకోవాలంటే మనం ఓటును నిజాయితీగా వేయాలి.

– నవ్యశ్రీ, బీఎస్సీ ఎంపీసీఎస్, సెకండియర్


ఎన్నికలప్పుడే హడావుడి



ఎన్నికలొచ్చినప్పుడు మాత్రమే లీడర్లు పనులు చేస్తారు. పదేళ్ల కిందట వేయాల్సిన సీసీ రోడ్లును అలాగే వదిలేశారు. రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. మా కాలనీకి సరైన రోడ్డు సౌకర్యం లేనందున చెత్త బండి కూడా వచ్చేది కాదు. మా కాలనీ ప్రజాప్రతినిధి కూడా అందుబాటులో ఉండడు. ఇలాంటి పరిస్థితి పోవాలంటే నిజాయితీగా వేస్తేనే లీడర్‌ను గట్టిగా నిలదీయవచ్చు.

– మదీయా, బీఎస్సీ, సెకండియర్

ఓటుహక్కు విలువైంది..



ఓటు హక్కు ఎంతో విలువైంది. దీన్ని మనం వృథా చేసుకోవద్దు. ఎన్నికల సమయంలో నాయకులు, రాజకీయ పార్టీలు ఇచ్చే తాయిలాలకు తలొగ్గకుండా ఓటును వినియోగించుకోవాలి. అప్పుడే మనం అనుకునే అభివృద్ధి జరుగుతుంది. మన ప్రాంతంలో నెలకొన్న సమస్యలు కూడా కొంత వరకు పరిష్కారం అవుతాయి.

– రోషిణి, బీఎస్సీ ఎంపీసీఎస్, ఫైనలియర్

SVS హాస్పిటల్ మహబూబ్‌నగర్

ఎముకల సాంద్రత స్కాన్

Whole Body Bone Density Scan

SVS హాస్పిటల్‌లో బోన్ డెన్సిటీ (DEXA) Whole Body Scan అందుబాటులో కలదు. ఎముకల లోని కాల్షియం మరియు సంబంధిత ఎముక ఖనిజాలను (Density) కొలుస్తూ తుంటి, వెన్నుముక, ముంజేయి మరియు మొత్తం ఎముకల సాంద్రత స్కాన్ చేయబడును. ఈ స్కాన్ ద్వారా ఆస్టియోపొరోసిస్, ఆస్టియోపీనియ వ్యాధి లక్షణాలను ముందే గుర్తించబడును, అత్యాధునిక 16 Channel, High Resolution తో కూడిన (DEXA) Whole Body Scan యంత్రం.

ఈ క్రింద తెలుపబడిన రేటు వర్తించును.

Whole Body Bone Density Scan - Rs.1500/-

వివరాలకు ఈ మొబైల్ 7893888529 / 6303444232 నెంబర్ల పై సంప్రదించగలరు.

Dept Of Orthopedics

SVS Medical College Hospital

అందుబాటు ధరలో ఉద్యోగప్రకటన అద్భుతమైన స్పందన...

సాక్షి

APPOINTMENTS

ఉద్యోగావకాశములు

మీ ఎంపికకు సులువైన మార్గం

ప్రతి మంగళ, శుక్రవారం సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించండి.

SAKSHI

99516 02829

నాడు వైభవం.. నేడు దయనీయం

అమరచింత నియోజకవర్గం మూడు ముక్కలు

- ఫస్ట్, లాస్ట్ ఎమ్మెల్యేలు మహిళలే..
- ఏకగ్రీవ ఎమ్మెల్యేగా రాజాసోంభూపాల్ రికార్డు
- కొత్త నియోజకవర్గాల్లోనూ ఇక్కడి నాయకులదే హవా



చంద్రగఢ్ కోట

ఆత్మకూర్: నాడు వైభవం.. నేడు దయనీయం అన్న చందంగా మారింది ఆత్మకూర్ పరిస్థితి. సంస్థానంగా, తాలూకా కేంద్రంగా, నియోజకవర్గంగా 1952 నుంచి 2009 వరకు కొనసాగిన అమరచింత సెగ్మెంట్ ప్రస్థానం పునర్విభజన కమిటీ పుణ్యమా అని మూడు ముక్కలైంది. ఎందరో నాయకులు రాజకీయంగా ఎదిగినా నియోజకవర్గాన్ని కాపాడుకోలేకపోయారు. అమరచింత నియోజకవర్గానికి 1952లో మొట్టమొదటి ఎమ్మెల్యేగా శాంతాబాయి ఎన్నిక కాగా.. 2009 నుంచి చివరి ఎమ్మెల్యేగా స్వర్ణసుధాకర్‌రెడ్డి కొనసాగారు. మహిళతో ప్రారంభమైన నియోజకవర్గం మహిళతోనే సమాప్తమైంది.

పునర్విభజనతో మూడు ముక్కలు..

2009 ఎన్నికల కంటే ముందు వరకు ఆత్మకూర్, దేవరకద్ర, ధన్వాడ, చిన్నచింతకుంట, నర్వ మండలాలతో అమరచింత నియోజకవర్గంగా కొనసాగింది. రాజకీయ వ్యవహారాల కమిటీ (సీపీపీఏ) నిర్వహించిన నియోజకవర్గాల పునర్విభజన అమరచింతను మూడు ముక్కలు చేసింది. ధన్వాడ మండలాన్ని కొత్తగా ఏర్పడిన నారాయణపేట సెగ్మెంట్‌లో కలుపగా.. ఆత్మకూర్, నర్వ మండలాలను మక్తల్ నియోజకవర్గంలో విలీనం చేశారు. దేవరకద్రను కొత్త నియోజకవర్గంగా రూపొందించి చిన్నచింతకుంట మండలాన్ని కలిపారు.

మూడు పర్యాయాలు రాజాసోంభూపాల్ ఏకగ్రీవం..

ఆత్మకూర్, అమ్మాపూర్ సంస్థానాధీశులు రాజా సోంభూపాల్ మూడు పర్యాయాలు ఏకగ్రీవ ఎమ్మెల్యేగా కొనసాగారు. ముస్లిం మైనార్టీ వర్గానికి చెందిన ఇస్మాయిల్‌సే, రఫీక్ మొహిదిఖాన్‌తో పాటు దేశాయి మురళీధర్‌రెడ్డి, కె.వీరారెడ్డి, కె.దయాకర్‌రెడ్డి ఎమ్మెల్యేలుగా ఎన్నికై అమరచింత సెగ్మెంట్‌కు ప్రాతినిధ్యం వహించారు.

దయాకర్‌రెడ్డి దంపతుల రికార్డు..

నియోజకవర్గ పునర్విభజన అనంతరం 2009లో జరిగిన ఎన్నికల్లో మక్తల్ నుంచి దయాకర్‌రెడ్డి, దేవరకద్ర నుంచి సీతాదయాకర్‌రెడ్డి ఎమ్మెల్యేలుగా గెలుపొంది ఉమ్మడి రాష్ట్రంలోనే రికార్డు సృష్టించారు. వారిద్దరూ అమరచింత సెగ్మెంట్‌కు చెందిన వారు కావడం విశేషం.

జిల్లాల ఏర్పాటుతో..

అమరచింత సెగ్మెంట్‌లో 1952 నుంచి ఉన్న మండలాలు.. 2009లో నియోజకవర్గాల పునర్విభజనలో మార్పులు జరగడంతో పాటు 2016 ఆగస్టులో ఏకంగా జిల్లాలే మారాయి. మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలోకి దేవరకద్ర, చిన్నచింతకుంట చేరగా, నారాయణపేట జిల్లాలోకి ధన్వాడ, నర్వ మండలాలు, వనపర్తి జిల్లాలో అమరచింత, ఆత్మకూర్ మండలాలు కలిశాయి.



రాజాసోంభూపాల్



డి.మురళీధర్‌రెడ్డి



కె.వీరారెడ్డి



కె.దయాకర్‌రెడ్డి



ఇస్మాయిల్‌సే



స్వర్ణసుధాకర్‌రెడ్డి

సాగునీటి వనరులు–పంటలు..

జూరాల ప్రాజెక్టు, కోయిల్‌సాగర్, చంద్రగఢ్, అమరచింత ఎత్తిపోతల పథకాలతో పాటు జూరాల ప్రధాన ఎడుమకాల్వ, రామన్‌పాడు, భీమా పథకంతో సాగునీరు అందుతోంది. ఆత్మకూర్ మండలంలోని దిగువ జూరాల జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రంలో తయారయ్యే విద్యుత్ తెలంగాణ సొంతం.

ఎన్నికైన ఎమ్మెల్యేల వివరాలు..

- 1952-1957 శాంతాబాయి (కాంగ్రెస్)
- 1957-1962 డి.మురళీధర్‌రెడ్డి (స్వతంత్ర)
- 1962-1978 రాజాసోంభూపాల్ (ఏకగ్రీవంగా మూడు పర్యాయాలు ఎన్నిక)
- 1978-1983 కె.వీరారెడ్డి (కాంగ్రెస్)
- 1983-1985 ఇస్మాయిల్‌సే (టీడీపీ)
- 1985-1989 రఫీక్ మొహిదిఖాన్ (టీడీపీ)
- 1989-1994 కె.వీరారెడ్డి (కాంగ్రెస్)
- 1994-2004 కె.దయాకర్‌రెడ్డి (టీడీపీ) రెండు పర్యాయాలు ఎన్నిక
- 2004-2009 స్వర్ణసుధాకర్‌రెడ్డి (కాంగ్రెస్)



అమరచింత నియోజకవర్గ మ్యాప్

ఢిల్లీ వరకు పోరాటం..

అమరచింత సెగ్మెంట్‌ను రద్దు చెయ్యడాన్ని నిరసిస్తూ అప్పట్లో పెద్ద ఎత్తున ఉద్యమం జరిగింది. సంస్థానాధీశుడు రాజ శ్రీరాంభూపాల్, మాజీ ఎమ్మెల్యేలు స్వర్ణసుధాకర్‌రెడ్డి, దయాకర్‌రెడ్డి, వీరారెడ్డిలతో పాటు న్యాయవాది దేశాయి ప్రకాష్‌రెడ్డి, శ్రీధర్‌గౌడ్, మహిమూద్, రామేశ్వర్‌రెడ్డిల ఆధ్వర్యంలో పలుమార్లు ఢిల్లీలోని రాజకీయ వ్యవహారాల కమిటీ (సీపీపీఏ)ను కలిసిన ఫలితం దక్కలేదు.

సీఎం కేసీఆర్ ప్రకటనతో..

మూడవసారి అధికారంలోకి వచ్చిన వెంటనే నెలరోజుల్లోగా ఆత్మకూర్‌ను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి కేసీఆర్ మక్తల్ ఎన్నికల సభలో ప్రకటించారు. అదేవిధంగా టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి కూడా ఆత్మకూర్‌తో పాటు మక్తల్‌ను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. బీజేపీ నాయకులు సైతం ఆత్మకూర్‌ను డివిజన్ చేసి పూర్వవైభవం తీసుకొస్తామని హామీనిస్తున్నారు. ఎన్నికల వేళ రాజకీయ పార్టీల నాయకుల హామీలు ఆశలు కలిగిస్తున్నాయి. మూడు పార్టీల్లో ఏ పార్టీకి అధికారమొచ్చినా ఆత్మకూర్ రెవెన్యూ డివిజన్ కావడం ఖాయమని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

తెరపైకి ఆత్మకూర్ డివిజన్....

ఒకప్పుడు సంస్థానంగా, తాలూకా కేంద్రంగా అన్ని రకాల కార్యాలయాలతో వైభవం చాటిన ఆత్మకూర్.. ఇప్పుడు అన్ని పోయి చిన్న మండలంగా కొనసాగుతోంది. ఆత్మకూర్‌ను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేస్తే పూర్వవైభవం వస్తుందని ఐదేళ్ల నుంచి ఉద్యమం సాగుతోంది. 2018 ఎన్నికల్లో ప్రభుత్వం ఇచ్చిన హామీ అమలు కాలేదు. ఇప్పటికైనా రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించి న్యాయం చేయాలంటూ ఆందోళనలు కొనసాగుతున్నాయి.

నేటినుంచి హ్యాండ్‌బాల్ టోర్నీ



మెయిన్ స్టేడియంలో హ్యాండ్‌బాల్ టోర్నీ ఏర్పాట్లు

- మెయిన్ స్టేడియంలో అండర్–19 రాష్ట్రస్థాయి పోటీలు
- హాజరుకానున్న ఉమ్మడి పది జిల్లాల జట్లు
- 340 మంది క్రీడాకారులు, 40 మంది అఫీషియల్స్ రాక

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లాకేంద్రంలోని మెయిన్ స్టేడియంలో శుక్రవారం నుంచి ఈ నెల 12 వరకు 67వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అంతర్ జిల్లా బాల, బాలికల అండర్– 19 రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ టోర్నీ నిర్వహించనున్నారు. ఎస్‌జీఎఫ్ అండర్–19 కార్యనిర్వాహక కార్యదర్శి పాపిరెడ్డి, టోర్నీ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎండీ జియావుద్దీన్ ఆధ్వర్యంలో అన్ని రకాల ఏర్పాట్లు చేశారు. రెండు కోర్టుల్లో హ్యాండ్‌బాల్ మ్యాచ్‌లు నిర్వహించనున్నారు.

టోర్నీలో పాల్గొననున్న జట్లు..

రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ హ్యాండ్‌బాల్ టోర్నీలో ఉమ్మడి జిల్లాలైన మహబూబ్‌నగర్, ఖమ్మం, నిజామాబాద్, వరంగల్, ఆదిలాబాద్, హైదరాబాద్, రంగారెడ్డి, కరీంనగర్, మెదక్, నల్లగొండకు చెందిన బాల, బాలికల జట్లు ఆడనుండగా.. ఇందులో 340 మంది క్రీడాకారులు, 40 మంది అఫీషియల్స్ పాల్గొననున్నారు. ఈ టోర్నీలో రాణించే క్రీడాకారులను హర్యానా రాష్ట్రం రోహతక్‌లో వచ్చే జనవరిలో జరిగే ఎస్‌జీఎఫ్ అండర్–19 జాతీయస్థాయి టోర్నీలో పాల్గొనే తెలంగాణ జట్లకు ఎంపిక చేయనున్నారు.

ముమ్మరంగా సాధన..

టోర్నీలో పాల్గొనే ఉమ్మడి జిల్లా బాల, బాలికల జట్లు మెయిన్ స్టేడియంలో గత కొన్ని రోజుల నుంచి ముమ్మరంగా సాధన చేసున్నాయి. కోచ్‌ల పర్యవేక్షణలో ప్రత్యేక శిక్షణ తీసుకుంటున్నారు. టోర్నీలో గెలుపే ధ్యేయంగా జిల్లా జట్లు మెరుగైన శిక్షణ తీసుకుంటుంది.

బాలుర జట్టులో.. రోహిత్, మహ్మద్ సమీ, ధనరాజ్‌గౌడ్, అబ్దుల్ జునేద్, షానవాజ్, అభిషేక్, పి.అజయ్, చరిత్‌రెడ్డి, జాన్‌పాల్, నమీరుద్దీన్, నరేష్ పవార్, సమీర్ హుస్సేన్, రోహిత్ భార్గవ్, ఎం.అశోక్, శివకుమార్, అఖిల్‌కుమార్ ఉన్నారు.

బాలికల జట్టులో.. ఎస్.మీనాక్షి, స్వప్న, శివాని చంద్ర, భవాని, వైశాలి, అనూష, నందిని, కె.నిఖిత, అమరాధ, తన్మయి, జ్యోతి, శ్రీవాణి, రాధిక, అంకిత, విథిత, వరలక్ష్మి ఉన్నారు.

ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తాం..



ఈ ఏడాది జిల్లాకు పలు రాష్ట్రస్థాయి అండర్–19 క్రీడా టోర్నీలను కేటాయించారు. వాటిని విజయవంతంగా నిర్వహిస్తాం. కరోనాతో మూడేళ్ల తర్వాత జిల్లాలో తొలి రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ టోర్నీ జరుగుతోంది. అందరి సహకారంతో హ్యాండ్‌బాల్ టోర్నీని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తాం.

– పాపిరెడ్డి, అండర్–19 ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి

ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు



హ్యాండ్‌బాల్ టోర్నీ మహబూబ్‌నగర్ జిల్లాలో నిర్వహిస్తున్నందుకు సంతోషంగా ఉంది. క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేశాం. రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ టోర్నీని విజయవంతంగా నిర్వహిస్తాం.

– ఎండీ జియావుద్దీన్, టోర్నీ ఆర్గనైజింగ్ సెక్రటరీ

వసతి వివరాలు ఇలా..

హ్యాండ్‌బాల్ టోర్నీలో పాల్గొనే బాలుర క్రీడాకారులకు మాడ్రన్ హైస్కూల్‌లో, బాలికలకు చైతన్య ఉన్నత పాఠశాలలో కళాశాలలో వసతి, అఫీషియల్స్‌కు స్విమ్మింగ్‌పూల్‌లోని పై అంతస్తులో ఏర్పాట్లు చేయగా స్టేడియంలో భోజన వసతి కల్పించనున్నారు. లీగ్ కం నాకౌట్ పద్ధతిలో హ్యాండ్‌బాల్ మ్యాచ్‌లను నిర్వహించనున్నారు. శుక్రవారం సాయంత్రం 4 గంటలకు మెయిన్ స్టేడియంలో రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ టోర్నీ ఘనంగా ప్రారంభం కానుంది.

ఒక సెగ్మెంట్.. ఇద్దరు ఎమ్మెల్యేలు

- 1961 వరకు కొనసాగిన ద్విసభ్య నియోజకవర్గాలు
- ఒకరు జనరల్, మరొకరు రిజర్వు స్థానాల్లో ప్రాతినిధ్యం

జడ్చర్ల టౌన్: ఒక నియోజకవర్గంలో ఇద్దరు ఎమ్మెల్యేలు ఉండేవారు తెలుసా.. అవును 1961 వరకు ద్విసభ్య నియోజకవర్గాలు ఉండేవి. ఒక ఎమ్మెల్యే స్థానం జనరల్‌కు కేటాయిస్తే.. మరో స్థానం ఎస్సీ, ఎస్టీలలో ఒకటి. అలా ఒకే నియోజకవర్గంలో ఇద్దరు సభ్యులు ప్రాతినిధ్యం వహించే వారు. హైదరాబాద్ స్టేట్‌లో మహబూబ్‌నగర్ జిల్లావ్యాప్తంగా నాలుగు ద్విసభ్య నియోజకవర్గాలు ఉండగా, ఆంధ్రప్రదేశ్‌లో విలీనం అయ్యాక మూడు ద్విసభ్య నియోజకవర్గాలు ఉన్నాయి. ఆయా నియోజకవర్గాల్లో ఎస్సీ రిజర్వు సభ్యుడికి ఎన్నికలు నిర్వహించారు.



1961లో ద్విసభ్య నియోజకవర్గాలు రద్దు చేయబడ్డాయి. ఆ తర్వాత ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ స్థానాలు ప్రత్యేకంగా కేటాయించబడ్డాయి. నాటి నుంచి సింగిల్ నియోజకవర్గాలుగానే కొనసాగుతున్నాయి.

1952లో 33 ద్విసభ్య నియోజకవర్గాలు..

1952లో హైదరాబాద్ స్టేట్ (తెలంగాణ రాష్ట్రం)లోని 175 శాసనసభ స్థానాలకు తొలిసారిగా ఎన్నికలు జరిగాయి. వీటిలో 33 ద్విసభ్య నియోజకవర్గాలు కాగా.. 109 సింగిల్ సీట్ నియోజకవర్గాలుగా ఉన్నాయి. మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లాలో 3 ద్విసభ్య నియోజకవర్గాలు ఉండేవి. అలంపూర్-గద్వాల ద్విసభ్య నియోజకవర్గం అప్పట్లో రాయచూరు జిల్లాలో ఉండేది.

ద్విసభ్య నియోజకవర్గం	ఎమ్మెల్యే
కల్వకుర్తి జనరల్	ఎం.నర్సింగ్‌రావు
కల్వకుర్తి రిజర్వుడు	కేఆర్ వీరాస్వామి
మక్తల్-ఆత్మకూర్ జనరల్	శాంతాబాయి
మక్తల్-ఆత్మకూర్ రిజర్వుడు	ఈ.బసప్ప
నాగర్‌కర్నూలు జనరల్	జి.బ్రహ్మరెడ్డి
నాగర్‌కర్నూలు రిజర్వుడు	డి.రామస్వామి
అలంపూర్-గద్వాల జనరల్	పాగపుల్లారెడ్డి
అలంపూర్-గద్వాల రిజర్వుడు	కె. నాగన్న

సింగిల్ నియోజకవర్గం	ఎమ్మెల్యే
పరిగి	షాజహాన్‌బేగం
షాద్‌నగర్	బూర్గుల రామకృష్ణారావు
మహబూబ్‌నగర్	పి.హన్మంతురావు
కొల్లాపూర్	అనంతరాంచంద్రారెడ్డి
వనపర్తి	సురవరం ప్రతాప్‌రెడ్డి

■ 1956లో హైదరాబాద్ స్టేట్ ఆంధ్రప్రదేశ్‌లో విలీనం కాగా.. 1957లో ఎన్నికలు జరిగాయి. 1955లోనే ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికలు కావడం వల్ల కేవలం తెలంగాణలోనే ఎన్నికలు నిర్వహించారు. అలా మొత్తం 85 శాసనసభ స్థానాలకు ఎన్నికలు జరిగాయి. వాటిలో 20 ద్విసభ్య స్థానాలు కాగా.. 65 సింగిల్ సభ్యుడు ఉన్న నియోజకవర్గాలు ఉన్నాయి. మహబూబ్‌నగర్ జిల్లాలో మక్తల్-ఆత్మకూర్‌లను విడదీసి వేర్వేరు నియోజకవర్గాలుగా మార్చారు. అలాగే రాయచూరు జిల్లాలో ఉన్న గద్వాల-అలంపూర్ ద్విసభ్య నియోజకవర్గాన్ని వేర్వేరు సెగ్మెంట్‌లుగా ఏర్పాటు చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో 167 శాసనసభ స్థానాలు ఉండగా.. 29 ద్విసభ్య నియోజకవర్గాలుగా ఉండేవి.

1957లో ద్విసభ్య నియోజకవర్గాలు..

ద్విసభ్య నియోజకవర్గం	ఎమ్మెల్యే
కల్వకుర్తి జనరల్	శాంతాబాయి
కల్వకుర్తి రిజర్వుడు	కె.నాగన్న
మక్తల్ జనరల్	బన్నప్ప
మక్తల్ రిజర్వుడు	ఈ. బసప్ప
నాగర్‌కర్నూలు జనరల్	జనార్దన్‌రెడ్డి
నాగర్‌కర్నూలు రిజర్వుడు	మహేంద్రనాథ్

సింగిల్ నియోజకవర్గాల వివరాలిలా..

నియోజకవర్గం	ఎమ్మెల్యే
మహబూబ్‌నగర్	ఏగూరు చిన్నప్ప
కొల్లాపూర్	ఎం.నర్సింగ్‌రావు
అలంపూర్	జయలక్ష్మీదేవమ్మ
గద్వాల	డీకే సత్యారెడ్డి
వనపర్తి	పద్మనాభరెడ్డి
ఆత్మకూర్	మురళీధర్‌రెడ్డి
కొడంగల్	అచ్యుతారెడ్డి
షాద్‌నగర్	షాజహాన్‌బేగం

రూపాయి నాణేలతో నామినేషన్ డిపాజిట్

నాగర్‌కర్నూల్‌లో నామినేషన్‌ల పర్వం కొనసాగుతుండగా గురువారం ఆసక్తికర సంఘటన చోటుచేసుకుంది. బీఎస్పీ అభ్యర్థి కొత్తపల్లి కుమార్ నామినేషన్ వేసేందుకు కావాల్సిన డబ్బును చిల్లర రూపంలో అధికారులకు ఇచ్చారు. రూపాయి ఇవ్వండి.. ఓటు వేయండి అనే నినాదంతో ఇటీవల ప్రచారం నిర్వహించిన కుమార్.. ప్రజలు ఇచ్చిన రూపాయి నాణేలతో నామినేషన్ వేశారు. రూ.1500 రూపాయి నాణేలతో పాటు మరో రూ.3,500 జత చేసి డిపాజిట్ డబ్బులు చెల్లించారు.



– నాగర్‌కర్నూల్

వనపర్తి బీజేపీ అభ్యర్థి మార్పు?

వనపర్తి: వనపర్తి నియోజకవర్గ బీజేపీ అభ్యర్థిగా పెద్దమందడి మండలం బలిజపల్లి–జంగమాయపల్లి జంట గ్రామాలకు చెందిన ఈ.అశ్వత్థామరెడ్డిని ఆ పార్టీ అధిష్టానం ఎంపికచేసి అధికారికంగా వెల్లడించిన విషయం తెలిసిందే. పార్టీ అంతర్గత విభేదాల కారణంగా అభ్యర్థి పోటీ చేయబోనని నిర్ణయించుకుని రాష్ట్ర శాఖకు తెలియజేయడంతో అభ్యర్థిని మార్చే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు అనుజ్ఞారెడ్డికి కమలం పార్టీ టికెట్ దాదాపుగా ఖరారు చేసినట్లు ఆ పార్టీ వర్గాలతో తెలిసింది. శుక్రవారం నామినేషన్ల దాఖలుకు చివరి రోజు కాగా.. నియోజకవర్గంలో పార్టీ క్యాడర్‌తో కలిసి ఆయన నామినేషన్ దాఖలు చేయనున్నట్లు ఇప్పటికే ప్రకటించారు. అభ్యర్థి ఎవరనే విషయాన్ని ఆ పార్టీ ఇప్పటికింకా ప్రకటించలేదు.

దేవరకద్ర బీజేపీ అభ్యర్థిగా ప్రశాంత్‌రెడ్డి?

దేవరకద్ర: దేవరకద్ర బీజేపీ అభ్యర్థిగా కొండా ప్రశాంత్‌రెడ్డిని పార్టీ అధిష్టానం ఖరారు చేసినట్లు తెలిసింది. ఈ మేరకు గురువారం రిటర్నింగ్ అధికారి కార్యాలయం నుంచి ముందస్తుగానే నామినేషన్ పత్రాలను తీసుకెళ్లారు.



ఉత్సాహంగా శ్రమించడం..
అలసటను ఆనందంగా భరించడం..
ఇవి విజయాన్ని కాంక్షించే నాయకుడి లక్షణాలు
- స్వామి వివేకానంద

నగదు సీజ్



గద్వాల క్రైం: గద్వాల మండల శివారులో గురువారం డీఎస్పీ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎలాంటి పత్రాలు లేకుండా తరలిస్తున్న రూ.3.55 లక్షల నగదును సీజ్ చేసి జిల్లా గ్రీవెన్స్ కమిటీకి అప్పగించినట్లు డీఎస్పీ తెలిపారు. ఈ తనిఖీల్లో సీఐ శ్రీనివాస్, ఎస్‌ఐ ఆనంద్ ఉన్నారు.

చిన్నచింతకుంట: మండలంలోని లాల్‌కోట చౌరస్తాలో పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. దేవరకద్ర మండలం కోపన్‌పల్లికి చెందిన గొల్ల రాములు తన వాహనంలో రూ.1.40 లక్షల నగదు తరలిస్తుండగా, పట్టుకుని సీజ్ చేసినట్లు ఎస్‌ఐ శేఖర్ తెలిపారు.

రేముద్దులలో చీరలు పట్టివేత

పానగల్: మండలంలోని రేముద్దులలో ఓటర్లకు పంపిణీ చేసేందుకు రెండు ఇళ్లల్లో చీరలను నిల్వ చేశారనే సమాచారం మేరకు గురువారం ఎఫ్‌ఎస్టీ–9 అధికారి రవి ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. రెండు ఇళ్లల్లో మొత్తం 232 చీరలను స్వాధీనం చేసుకుని, పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. పట్టుబడిన చీరలు బీజేపీకి సంబంధించినవని ఇంటి యజమానులు తెలిపినట్లు పేర్కొన్నారు. ఎఫ్‌ఎస్టీ అధికారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ వేణు తెలిపారు.



లైన్ దాటను.. కాంగ్రెస్‌ను వదలను

- డబ్బులతో నా రాజకీయ జీవితం గొంతుకోశారు
- ఏఐసీసీ కార్యదర్శి, మాజీ మంత్రి చిన్నారెడ్డి వ్యాఖ్యలు

వనపర్తి టౌన్: కాంగ్రెస్ హైకమాండ్ ఇచ్చిన మాటకు కట్టుబడి లైన్ దాటనని, పార్టీని వదిలిపెట్టనని మాజీ మంత్రి, ఏఐసీసీ కార్యదర్శి చిన్నారెడ్డి అన్నారు. పార్టీని గెలిపించడం మన ధర్మమని, నా రికార్డు, చరిత్ర కాంగ్రెస్ వద్ద ఉందని పేర్కొన్నారు. మేఘారెడ్డి వద్ద కొన్ని దుష్టశక్తులు ఉన్నందుకే వనపర్తితో సంబంధం ఉన్న రేవంత్‌రెడ్డితో పార్టీ క్యాడర్‌కు భరోసా ఇప్పించే ప్రయత్నం చేసినట్లు వెల్లడించారు. గురువారం వనపర్తిలో తన మద్దతుదారులు, కార్యకర్తలు, నాయకులతో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో మాట్లాడారు. నిద్ర, తిండి లేకుండా.. ఎండ, వాన, చలి అనక పార్టీకి పనిచేసి.. గ్రామ కమిటీలు వేసి, 45 వేల డిజిటల్ సభ్యత్వాలు చేయిస్తే.. డబ్బుతో 45 ఏళ్ల నా రాజకీయ జీవితాన్ని గొంతుకోస్తే మా గతేం కావాలని ప్రశ్నించారు. సోనియాగాంధీ ఇచ్చిన టికెట్‌ను మారిస్తే.. కారణం ఏమిటని అడగలేకపోలేదని చెప్పారు. 45 ఏళ్లుగా పని చేస్తున్న చిన్నారెడ్డికి సర్వేలో తక్కువ శాతం వచ్చి.. నాలుగు నెలల క్రితం వచ్చిన మేఘారెడ్డికి అధిక శాతం వస్తుంది.. ఇదేమి విచిత్రమని విస్మయం వ్యక్తం చేశారు. నాలుగు నెలల్లో నియోజకవర్గాన్ని మాయ చేశారా.. బీఆర్‌ఎస్ నాయకులను మొత్తం వెంట తెచ్చుకున్నారా.. అని నిలదీశారు. తాను సర్వేలను తప్పుబట్టడం లేదని, సర్వే చేసేవాళ్లను మేనేజ్ చేశారని ఆరోపించారు. మేఘారెడ్డి నాకు సపోర్టుగా ఉంటాడని జూపల్లే చెప్పారని గుర్తుచేశారు. టికెట్‌కు ఖర్చు పెట్టిన డబ్బు ఎన్నికల్లో ఖర్చు పెడితే మేఘారెడ్డి సులువుగా గెలుస్తారన్నారు. తనను చదువురాని వాళ్లకంటే అధ్వానంగా దూషించారని, అనరాని మాటలు అన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మొదటి నుంచి కాంగ్రెస్‌లో ఉన్న వ్యక్తికి టికెట్ ఇచ్చి ఉంటే అప్పగింతలు అవసరం లేదని, కొత్త వ్యక్తి, కాంగ్రెస్ సంస్కృతి తెలియని వ్యక్తికి టికెట్ రావడంతో మా వాళ్ల రాజకీయ భవిష్యత్ ఏమిటనే భయంతోనే రేవంత్‌ను భరోసా ఇవ్వమని అడిగినట్లు చెప్పారు. రెండేళ్ల కిందటే తన కుమారుడు ఆదిత్యను రాజకీయాల్లోకి తెచ్చి ఉంటే మరోలా ఉండేదని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ వస్తే మంచి స్థానంలో ఉంటామని, రాకుంటే జాతీయ స్థాయిలో గౌరవప్రదమైన హోదాలో ఉంటానని పేర్కొన్నారు.

రేవంత్‌రెడ్డి సీఎం అయితే పాలమూరుకు మేలు

టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లురవి

నాగర్‌కర్నూల్: ఉమ్మడి పాలమూరు నుంచి బూర్గుల రామకృష్ణారావు ముఖ్యమంత్రిగా పనిచేశారని, ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత జిల్లా నాయకుడు రేవంత్‌రెడ్డి సీఎం అయితే ఉమ్మడి పాలమూరు జిల్లాకు మేలు జరుగుతుందని టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లురవి అన్నారు. ఇందుకోసం ఉమ్మడి పాలమూరు జిల్లాలోని 14 అసెంబ్లీ స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాల్సిన అవసరం ఉందన్నారు. గురువారం నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన స్థానిక అభ్యర్థి కూచకుళ్ల రాజేష్‌రెడ్డితో కలిసి మాట్లాడారు. గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నీటి మూటలు గానే మిగిలిపోయాయని, ఎమ్మెల్యేలు, మంత్రులు బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో దిష్టిబొమ్మలుగా మారారని దుయ్యబట్టారు. ప్రజా సమస్యలపై స్పందించే అవకాశం కూడా ఎమ్మెల్యేలకు లేదని ఎద్దేవా చేశారు. ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికలు రాజుల ప్రభుత్వం, ప్రజల ప్రభుత్వం మధ్య అని అభివర్ణించారు. ఇప్పుడు రాజరిక పాలన కొనసాగుతుందని, ఎన్నికల తర్వాత ప్రజల ప్రభుత్వం వస్తుందని జోస్యం చెప్పారు. బీఆర్‌ఎస్‌కు ప్రత్యామ్నాయంగా ఉన్న కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి రావడం ఖాయమని, 75 నుంచి 85 సీట్లతో రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కాబోతుందన్నారు. డిసెంబర్ 9న జరిగే క్యాబినెట్ తొలి సమావేశంలో వందరోజుల్లో ఇచ్చిన హామీలన్నీ అమలుచేసేలా తీర్మానం చేస్తామన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

కంపెనీ అన్ని రకాల బిజినెస్ ల్యాప్ ప్రాజెక్టును అందిస్తుంది. DMA Welcome, Salary. 9990752820.

వ్యక్తిగత, వ్యవసాయ, వ్యాపార ప్రాపర్టీ కొరకు అతి తక్కువ వడ్డీతో ఋణాలు. సిబిల్ అవసరం లేదు. NPA కూడా. సెల్: 8437824006.

BUSINESS OFFER

Distribution Invitation Invest 1 Lakh and above Get up to 1 Lakh & above/Month Contact : for more info: 9010492111

WANTED

Ph: 9846571888/ 9640400073

రామకృష్ణ గ్రూప్స్, (TS No.1) HYD, VJA, TS & AP 24x7. ☎ 92614 52638, 82474 49036.

మన పట్టణంలో కొత్తగా స్థాపించిన బ్రాంచ్ నందు పనిచేయుటకు ఇంటర్, డిగ్రీ, బి.టెక్, పిజి చదివిన అభ్యర్థులు కావలెను. 9989684642



గమనిక

– సాక్షి మేనేజర్

భవిత విద్యార్థుల కోసం

సాక్షి ఫ్యామిలీ
మహబూబ్‌నగర్
శుక్రవారం ॥ 10-11-2023

ఫ్యాషన్

వార్డ్ రోబ్‌లకూ వెలుగులు





పట్టుబట్టలతోనే కాదు మనవైన సంప్రదాయ దుస్తులతోనూ వెలిగిపోవచ్చు.
మోడ్రన్ షేర్వాణీలను ధోతీ ప్యాంట్లతో మ్యాచ్ చేయచ్చు.
పర్యావరణ అనుకూలమైన డ్రెస్సులను ఎంచుకోవచ్చు.
పాత కాలం నాటి ప్రింట్లు, హ్యాండ్‌మేడ్ డిజైన్స్‌కి ప్రాధాన్యం ఇవ్వచ్చు.
ఎవర్‌గ్రీన్ లుక్‌తో రాబోయే రోజులను
ప్రకాశవంతంగా మార్చడానికి ఈ దీపావళి నుంచే మొదలుపెట్టవచ్చు.
పండగ రోజున దీపాలనే కాదు
సరికొత్త ట్రెండ్‌తో వార్డ్ రోబ్‌లను కూడా వెలిగించవచ్చు.
ప్రతి వేడుకలోనూ మెరిసిపోవచ్చు.



నియో–సంప్రదాయం

పాతకాలం నాటి కుర్తాలు, షేర్వాణీలు ఇప్పుడు కొత్తగా రూపాంతరం చెందాయి. ఈ దీపావళికి ఇవి ఎంతో అందంగా ఉంటాయి. అలాగే, లేయర్డ్ షేర్వాణీలు, ధోతీ ప్యాంట్‌లను ధరించవచ్చు. వీటిని మోడర్న్ డిజైన్, ఓల్డ్ ట్రెడిషన్‌తో మిళితం చేయచ్చు. ఈ మిక్స్ అండ్ మ్యాచ్ వల్ల సొగసైన రూపాన్ని పొందవచ్చు. ఇక నియాన్ కలర్స్ ఇప్పుడు ట్రెండ్‌లో ఉన్నాయి. వీటిలో బ్లూ, రెడ్, గ్రీన్, ఎల్లో కలర్స్ చాలా ప్రకాశవంతంగా ఉంటాయి. ఇవి సాధారణ రంగుల నుండి కాంతివంతంగా కనిపిస్తాయి.

పర్యావరణ అనుకూలం

సరైన అవగాహనతో ఫ్యాషన్ పర్యావరణ అనుకూల బట్టల వైపు మొగ్గు చూపుతోంది. సేంద్రియ పత్తి, వెదురు, జనపనార బట్టలు స్థిరంగా ఉండటమే కాకుండా మట్టి సొబగులను కూడా వెదజల్లుతాయి. నురయ్యా, ఇతర ప్రముఖ బ్రాండ్‌లు ఈ ట్రెండ్‌లో ముందంజలో ఉన్నాయి.



పేస్టల్స్ పెరుగుదల

దీపావళి ప్రకాశవంతమైన రంగులకు పర్యాయపదంగా ఉన్నప్పటికీ, లావెండర్, మింట్, బేబీ పింక్ పేస్టెల్ కలర్స్ పండుగ కళను పెంచుతాయి. ఈ రంగులు ప్రశాంతతతోపాటు రిచ్‌నెస్‌ను కళ్లకు కడతాయి.

డిజిటల్ ప్రింట్లు సాంప్రదాయ మూలాంశాలు

సాంకేతికత మన జీవితంలోని ప్రతి రంగాన్నీ ప్రభావితం చేస్తున్నప్పుడు ఫ్యాషన్‌ను మాత్రం ఎందుకు వదిలివేయాలి... అందుకే, లోటస్ లేదా పీకాక్ ఫెదర్స్‌తో కూడిన భారతీయ సంప్రదాయ మూలాంశాలను ప్రదర్శించే డిజిటల్ ప్రింట్లు గొప్పగా కనిపిస్తున్నాయి. ఈ ప్రింట్లు, డిజైన్లు సంప్రదాయానికి ఆధునిక టచ్‌ను అందిస్తున్నాయి.

పాతకాలపు డిజైన్ల పునరుద్ధరణ

బనారసీ సిల్క్స్, చికంకారి ఎంబ్రాయిడరీ, బంధని వంటి పాతకాలపు వస్త్రాల ఆకర్షణ మళ్లీ మళ్లీ ఆకట్టుకుంటుంది. డిజైనర్లు ఈ సంప్రదాయ వస్త్రాలను ఆధునిక దుస్తులలో డిజైన్ చేస్తున్నారు. మనదైన గొప్ప వారసత్వాన్ని దేశీయ కళాకారులు కాపాడుతున్నారు.

చేతితో తయారు చేసిన పాదరక్షలు

పాదరక్షల్లో మన దేశీయ హస్తకళా నైపుణ్యం తనదైన ముద్ర వేస్తోంది. జూతీలు, కొల్హాపురీ, ఎంబ్రాయిడరీ ఇతర అలంకారాలతో చేతితో తయారు చేసిన పాదరక్షలలో దేనిని ఎంపిక చేసుకున్నా పండగ కళ కనిపిస్తుంది. ఇవి కళాకారుల నైపుణ్యానికి నిదర్శనంగా ఉండటమే కాకుండా, వేడుకలో ప్రత్యేకమైన టచ్‌ను అందిస్తాయి.





సమాజానికి మంచి ఆహారాన్నివ్వాలనుకుంది.
ఖాద్యమ్... పేరుతో తినదగిన ఆహారాన్నిస్తోంది.
'వరల్డ్ ఫుడ్ ఇండియా'లోనూ నిరూపించుకుంది.
దేశ రక్షణ కోసం కొండల్లో గుట్టల్లో డ్యూటీ చేసే
సైన్యానికి మంచి ఆహారాన్నిచ్చే బాధ్యత చేపట్టింది.
ఈ సందర్భంగా కట్టికోల మాధవి విజయగాథ.

జై జవాన్‌కు టిఫిన్ బాక్స్

రక్షణరంగంలో విధులు నిర్వర్తించే వారి ఆహారం ఎలా ఉండాలో నిర్దేశించడానికి డీఎఫ్‌ఆర్‌ఎల్‌లో రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ విభాగం పని చేస్తూ ఉంటుంది. ఆ ప్రమాణాల మేరకు ఆహారం తయారు చేయడానికి అనుమతి సాధించారు ఓ తెలుగు మహిళ. ఈ అనుమతి సాధించడానికి ముందు ఆమె ఆహారం మీద అంతులేని పరిశోధన చేశారు. భూమిలో నాటే గింజ నుంచి పంట దిగుబడి, దినుసులను ప్రాసెస్ చేయడం, వండి చల్లార్చి డబ్బాల్లో ప్యాక్ చేయడం వరకు ప్రతిదీ ఒక చేతి మీదుగా నడిచినప్పుడే నిర్దేశించిన ప్రమాణాలను పాటించగలమని నమ్ముతారామె. సేంద్రియ పంట, వంటను ఈ నెల న్యూఢిల్లీలో జరిగిన 'వరల్డ్ ఫుడ్ ఇండియా' సదస్సులో ప్రదర్శించి మరోసారి నిరూపించారు. ఈ సందర్భంగా సాక్షితో తన అనుభవాలను పంచుకున్నారు హైదరాబాద్‌లో నివసిస్తున్న కట్టికోల మాధవి.

రైతులు విచిత్రంగా చూశారు!

మాది సూర్యాపేట. నాన్న ఉద్యోగ రీత్యా నా చదువు మొత్తం హైదరాబాద్‌లోనే. నిజానికి నా చదువుకి, నేనెంచుకున్న ఈ రంగానికి సంబంధమే లేదు. బీఎస్సీ స్టాటిస్టిక్స్ చేసి కొంత కాలం టీచర్‌గా, ఆ తర్వాత బ్యాంకులో ఉద్యోగం చేశాను. మా వారు మైక్రో బయాలజీ చేసి హిమాలయ సంస్థలో ఉద్యోగం చేశారు. నెలలో ఇరవై రోజులు క్యాంపుల ఉద్యోగం ఆయనది. జీవితం ఇది కాదనిపించేది. మన జ్ఞానాన్ని సరిగ్గా ఒకదారిలో పెడితే గొప్ప లక్ష్యాలను సాధించవచ్చనిపించింది. సొంతంగా ఏదో ఒకటి చేయాలనే నిర్ణయానికి 2009లో వచ్చాం. నాలుగేళ్లపాటు సమాజం అవసరాలేమిటి, అందుబాటులో ఉన్న వనరులేమిటి అని అధ్యయనం చేశాం. సమాజంలో ఆరోగ్యకరమైన ఆహారం తప్ప అన్నీ ఉన్నాయని తెలిసింది. మేము 2014లో గ్రామాలకు వెళ్లి రైతులతో కొర్రలు పండిస్తారా అని అడిగినప్పుడు మమ్మల్ని వెర్రివాళ్లను చూసినట్లు చూశారు. కుగ్రామాలకు వెళ్లి మహిళలకు మా ఉద్దేశాన్ని వివరించాం. విత్తనాల నుంచి పంటకు అవసరమైన ఇన్‌పుట్స్ అన్నీ మేమే ఇస్తాం, మీరు పండించిన పంటను మేమే కొంటాం... అని భరోసా ఇచ్చాం. దాంతోపాటు వారు పండించే కంది పంట మధ్య చాళ్లలో చిరుధాన్యాలను పండించమని సూచించాం. ఒక కందిపంట సమయంలో చిరుధాన్యాలు మూడు పంటలు వస్తాయి. తమకు నష్టం ఏమీ ఉండదనే నమ్మకంతోపాటు మామీద విశ్వాసం కలిగిన తర్వాత ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిశా, రాజస్థాన్, సిక్కిం రాష్ట్రాల్లో మొత్తం 1350 మంది మహిళారైతులు మాతో కలిశారు. గ్రౌండ్ వర్క్ చేసిన తర్వాత 2018లో కంపెనీ ఖాద్యమ్‌ని రిజిస్టర్ చేశాం. ఖాద్యమ్ అనే సంస్కృత పదానికి అర్థం తినదగినది అని. పంట నుంచి మా ప్రయోగాలు వంటకు విస్తరించాయి.

వండి చల్లబరుస్తాం!

ఇడ్లీ, సాంబార్, చట్నీ వంటి ఆహార పదార్థాలు యంత్రాల్లోనే తయారవుతాయి. ఉడికిన వెంటనే మైనస్ నలభై డిగ్రీల ఉష్ణోగ్రతకు తీసుకువెళ్లడంతో వాటిలో ఉండే తేమ హరించుకుపోతుంది. ఇలా తయారైన ఆహారం ప్యాకెట్లలో తొమ్మిది నెలల పాటు నిల్వ ఉంటుంది. వేడినీటిలో ముంచితే ఐదు నిమిషాల్లో ఇడ్లీ మెత్తగా మారుతుంది, సాంబార్, చట్నీలు కూడా అంతే. మేము కనుగొన్న విజయవంతమైన ఫార్ములా ఇది. పోహా నుంచి స్పగెట్టీ, పాస్తా వరకు ఒక ఇంట్లో అన్ని తరాల వారూ ఇష్టపడే రుచులన్నింటినీ ఇలాగే చేస్తున్నాం. మొదట్లో రెడీ టూ కుక్ ఉత్పత్తుల మీద దృష్టి పెట్టాం. రోజూ వండి బాక్సు పట్టుకెళ్లడం కుదరని రోజుల్లో రెడీ టూ ఈట్ విధానాన్ని అనుసరించాం. ఆఫీస్‌కి టిఫిన్ బాక్స్ తేలిగ్గా తీసుకెళ్లడానికి, ప్రయాణాల్లో తీసుకెళ్లడానికి మా ఉత్పత్తులు చాలా అనువుగా ఉంటాయి. ఇవన్నీ ఒక ఎత్తయితే సైన్యం అవసరాలకు తగినట్లు ఆహారాన్ని తయారు చేయడం పెద్ద సవాల్ అనే చెప్పాలి. మైసూర్‌లో ఉన్న డీఎఫ్‌ఆర్‌ఎల్‌కి ఎన్నిసార్లు వెళ్లామో లెక్క పెట్టలేం. యాభైసార్లకు పైగా వెళ్లి ఉంటాం. విమాన టిక్కెట్ల ఖర్చే లక్షల్లో వచ్చింది. సైంటిస్టులు సూచించిన నియమావళి ప్రకారం తయారు చేయడం, శాంపుల్ తీసుకెళ్లి చూపించడం, వాళ్లు చెప్పిన సవరణలను రాసుకుని హైదరాబాద్ రావడం. మేడ్చల్ దగ్గర బండ మాదారంలో ఉన్న మా యూనిట్‌లో తయారు చేసి మళ్లీ పట్టుకెళ్లడం... ఇలా సాగింది. మా ప్రయోగాల గురించిన ప్రతి వివరాన్నీ నోట్స్ సమర్పించాం. జీవితంలో ఓ గొప్ప లక్ష్యాన్ని సాధించాలనుకున్నాం. ఆ ప్రయాణంలో మేము లక్ష్యాన్ని చేరేలోపు ఉద్యోగంలో సంపాదించుకున్న డబ్బు రెండు కోట్లకు పైగా ఖర్చయిపోయింది. ఏ దశలోనూ వెనుకడుగు వేయకుండా దీక్షగా ముందుకెళ్లడమే ఈ రోజు విజేతగా నిలిపింది. ఏ– ఐడియా వంటి ప్రభుత్వ రంగ సంస్థలు ఆర్థికంగానూ, మౌలిక వసతుల కల్పనలోనూ సహకరిస్తున్నాయి. మా ఉత్పత్తులు ఈ–కామర్స్ వేదికల మీద పన్నెండు దేశాలకు చేరుతున్నాయి. ఢిల్లీలో ఈ నెల మూడు నుంచి ఐదు వరకు 'వరల్డ్ ఫుడ్ ఇండియా' సదస్సు జరిగింది. అందులో స్టాల్ పెట్టమని ప్రభుత్వం నుంచి ఆహ్వానం రావడమే ఈ ప్రయత్నంలో మేము గెలిచామని చెప్పడానికి ఉదాహరణ'' అని వివరించారు ఖాద్యమ్ కో ఫౌండర్ మాధవి.

– వాకా మంజులారెడ్డి
ఫొటో : సోమల రాజేశ్ రెడ్డి

వరల్డ్ ఫుడ్ ఇండియా సదస్సులో...



డీఎఫ్‌ఆర్‌ఎల్... డిఫెన్స్ ఫుడ్ రిసెర్చ్ లాబొరేటరీ. కర్నాటక రాష్ట్రం మైసూరులో ఉన్న ఈ సంస్థ డీఆర్‌డీవో (డిఫెన్స్ రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్)లో ఒక విభాగం. రక్షణ రంగంలో విధులు నిర్వర్తించే వారికి నిల్వ ఉండే ఆహారాన్ని సరఫరా చేస్తుంది. పర్వత ప్రాంతాలు, లోయలు, గడ్డకట్టే మంచులో ఉండే ఆర్మీ క్యాంపుల్లో విధులు నిర్వర్తించేవారికి తాజా ఆహారాన్ని అందించడం కొన్ని సందర్భాల్లో సాధ్యం కాదు. అలాంటి సమయాల్లో వారి ఆకలి తీర్చేది... ముందుగానే వండి, శీతలపరిచి డబ్బాల్లో నిల్వ చేసిన ఆహారమే. అలా నిల్వ చేసే ఆహారాన్ని తయారు చేయడం అత్యంత క్లిష్టమైన పని. ఆహారం నెలల కొద్దీ నిల్వ ఉండాలి. అందులో పోషకాలు లోపించకూడదు.

వంటిల్లు

వెచ్చటి వెలుగుల్లో తియ్యటి ఘుమఘుమలు

ఇల్లంతా దీపాల సందడి, టపాసుల వెలుగుల్లో చిన్నాపెద్దల చిరునవ్వులతో ఒకటే హడావుడి. స్వీట్లు చేయడానికి ఓపిక, సమయం రెండూ ఉండవు. అయినా పండగపూట మనింట్లో తయారైన తీపి రుచే వేరు. అందుకే సులభంగా చేసుకోదగిన తీపి ఘుమఘుమలతో వచ్చేసింది మనందరి వంటిల్లు....

గుడ్ పారే



కావలసినవి: మైదా – రెండు కప్పులు; నెయ్యి – పావు కప్పు; పాలు – అరకప్పు; బెల్లం – కప్పు; శొంఠి పొడి – టీస్పూను; నూనె – డీప్‌ఫ్రైకి సరిపడా.

తయారీ: మైదాపిండిలో నెయ్యివేసి కలపాలి ● తరువాత గోరువెచ్చని పాలుపోసి ముద్దలా కలిపి ఇరవై నిమిషాలు పక్కన పెట్టుకోవాలి ● ఇరవై నిమిషాల తరువాత పిండిముద్దను రెండు భాగాలు చేయాలి ● ఒక్కో భాగాన్నీ మందపాటి చపాతీలా వత్తుకుని అంగుళం పరిమాణంలో ముక్కలు చేయాలి ● మిగతాపిండిని కూడా ఇదే విధంగా చేయాలి ● ఇప్పుడు సలసల కాగుతోన్న నూనెలో ఈ ముక్కలను వేసి మీడియం మంట మీద వేయించాలి. రెండువైపులా గోల్డెన్ బ్రౌన్ కలర్‌లోకి మారితే పారేలు రెడీ అయినట్లే, వెంటనే తీసేయాలి ● బెల్లాన్ని గిన్నెలో వేసి పావుకప్పు నీళ్లుపోసి స్టవ్ మీద పెట్టాలి. మీడియం మంట మీద బెల్లం కరిగి సిరప్‌లా తయారయ్యేంతవరకు మరిగించాలి ● అడుగు అంటకుండా తిప్పుతూనే ఉండాలి. సిరప్ తయారైన తరువాత శొంఠి పొడివేసి కలిపి దించేయాలి ● వేయించి పెట్టుకున్న పారేలను సిరప్‌లో వేసి కలుపుతూనే ఉండాలి. ఇలా కలుపుతూ ఉండగానే మిశ్రమం మొత్తం చల్లబడి గుడ్ పారేలు అతుక్కోకుండా విడివిడిగా వస్తాయి. ఇప్పుడు తీసి ప్లేటులో వేసి సర్వ్‌చేసుకోవాలి ● గాలి చొరబడని డబ్బాలో వేసి ఉంచితే నెలరోజులపాటు నిల్వ ఉంటాయి.

కాజు పిస్తా రోల్స్




కావలసినవి: జీడిపప్పు – ఒకటిన్నర కప్పులు; పిస్తా పప్పు – ఒకటిన్నర కప్పులు; కండెన్స్‌డ్ మిల్క్ – ఒకటింబావు కప్పులు; గ్రీన్ ఫుడ్ కలర్ – ఐదు చుక్కలు; బటర్ – రెండు టేబుల్ స్పూన్లు; పంచదార పొడి – కప్పు; యాలకులపొడి – పావు టీస్పూను;

తయారీ: జీడిపప్పును దోరగా వేయించి, మెత్తగా గ్రైండ్ చేయాలి. ● గ్రైండ్ అయిన తరువాత జల్లెడపట్టి పొడిని తీసుకోవాలి. ●బాణలిలో వెన్న వేసి వేడెక్కనివ్వాలి. కరిగిన బటర్‌లో కండెన్స్‌డ్ మిల్క్ పోయాలి. ● నిమిషం పాటు పాలను కలుపుతూ ఉండాలి. తరువాత జీడిపప్పు పొడి వేయాలి. ● సన్నని మంటమీద తిప్పుతూ ఐదునిమిషాలు వేయించాలి. తరువాత దించేసి చల్లారనివ్వాలి. ●చేతులకు కొద్దిగా నెయ్యి రాసుకుని జీడిపప్పు మిశ్రమాన్ని ముద్దలా కలిపి పెట్టుకోవాలి. ● ఇప్పుడు పిస్తాపప్పుని దోరగా వేయించి మెత్తగా గ్రైండ్ చేయాలి. ● గ్రైండ్ చేసిన మిశ్రమాన్ని జల్లెడపట్టి మెత్తటి పొడిని తీసుకోవాలి. ● పిస్తా పొడిలో పంచదార పొడి, యాలకుల పొడి, ఫుడ్ కలర్ కొద్దిగా వేడి నీళ్లు చల్లుకుంటూ ముద్దలా కలపాలి. ● ఇప్పుడు జీడిపప్పు ముద్దను రెండు ముద్దలుగా చేసి, ఒక్కో ముద్దను మందపాటి చపాతీలా వత్తుకుని, కాస్త వెడల్పుగా ఉండేలా ముక్కలు కోయాలి. ● పిస్తా ముద్దను చిన్న ఉండలుగా చేసి, వీటిని పొడవాటి రోల్స్‌లా చుట్టుకోవాలి. ● జీడిపప్పు ముక్కపైన పిస్తా రోల్‌ను పెట్టి, జీడిపప్పు ముక్కను రోల్ చేయాలి. ● పిండి ముద్దను మొత్తాన్ని ఇలా రోల్ చేసి, పైన కుంకుమ పువ్వు, సిల్వర్ పేపర్‌తో గార్నిష్ చేస్తే కాజుపిస్తా రోల్స్ రెడీ.

షీర్ పీరా

కావలసినవి: పంచదార – కప్పు; పాలపొడి – రెండు కప్పులు; బాదం పలుకులు – టేబుల్ స్పూను; జీడిపప్పు పలుకులు – టేబుల్ స్పూను; పిస్తా పలుకులు – టేబుల్ స్పూను; కిస్‌మిస్ – టేబుల్ స్పూను; యాలకులు – నాలుగు; నెయ్యి – టేబుల్ స్పూను; గార్నిష్ కోసం.... పిస్తా, బాదం, జీడిపప్పు పలుకులు – టేబుల్ స్పూను (పెద్దసైజువి).

తయారీ: డ్రైఫ్రూట్స్ పలుకులు సన్నగా పొడవుగా ఉండేలా తీసుకోవాలి ● మందపాటి బాణలిలో పంచదార, కప్పు నీళ్లుపోసి మంటమీద పెట్టాలి ● తీగపాకం వచ్చేంత వరకు మరిగించాలి ● తీగపాకం వచ్చినప్పుడు సన్నమంటమీద ఉంచాలి ● ఇప్పుడు పాలపొడిని కొద్దికొద్దిగా వేస్తూ ఉండలు లేకుండా కలుపుతూ ఉండాలి ● పాలపొడి దగ్గర పడేంత వరకు కలుపుతూనే ఉండాలి ● దగ్గర పడుతున్నప్పుడు బాదం, జీడిపప్పు, పిస్తా పలుకులు, కిస్‌మిస్ ముక్కలను వేసి కలపాలి ● చివరిగా యాలకులను పొడిచేసి వేయాలి ● ప్లేటుకును నెయ్యి రాసి ఈ మిశ్రమాన్ని వేయాలి ● ప్లేటంతా సమంగా పరుచుకుని పైన కొద్దిగా పిస్తా, బాదం, జీడిపప్పు పలుకులు చల్లాలి ● స్పూను పెట్టి పైన కూడా సమంగా వత్తుకుని ప్లేటుని రిఫ్రిజిరేటర్‌లో పెట్టాలి ● రెండు గంటల తరువాత నచ్చిన ఆకారంలో ముక్కలు కట్‌చేసి సర్వ్ చేసుకోవాలి.



చిరోటీ



కావలసినవి: మైదా – ఒకటింబావు కప్పులు; సూజీ రవ్వ – కప్పు; నెయ్యి – రెండు టేబుల్ స్పూన్లు; ఉప్పు – చిటికెడు; నూనె – డీప్‌ఫ్రైకి సరిపడా; పంచదార – అరకప్పు; యాలకులు – మూడు; పిస్తా తురుము గార్నిష్‌కు సరిపడా.

పేస్టుకోసం: బియ్యప్పిండి – రెండు టేబుల్ స్పూన్లు; నెయ్యి – మూడు టేబుల్ స్పూన్లు.

తయారీ: కప్పు మైదా, సూజీరవ్వ, ఉప్పుని ఒక గిన్నెలో వేసి కలిపి పెట్టుకోవాలి ● బాణలిలో నెయ్యి వేసి వేడెక్కనివ్వాలి. కాగిన నెయ్యిలో కలిపి పెట్టుకున్న మైదా మిశ్రమాన్ని వేసి వేయించాలి. ● రెండు నిమిషాల తరువాత నీళ్లు చల్లుకుంటూ పూరీ పిండిలా కలుపుకోవాలి. ● పిండి ముద్ద తయారయ్యాక దానిపై తడిబట్టని కప్పి రెండుగంటలు పక్కన పెట్టుకోవాలి. ● ఇప్పుడు పంచదార, యాలకులను మిక్సీజార్‌లో వేసి మెత్తగా పొడిచేయాలి. ● కరిగించిన నెయ్యిని బియ్యప్పిండిలో వేసి, పేస్టులా కలిపి పెట్టుకోవాలి. ● రెండు గంటల తరువాత పిండి ముద్దను మరోసారి బాగా కలిపి దానిని చిన్నచిన్న ఉండలుగా చేయాలి. ● ఒక్కో ఉండను చపాతీలా వత్తుకోవాలి. ● మూడు చపాతీలు చేసిన తరువాత... ఒకదాని మీద ఒకటి పెట్టి పై చపాతీపైన టీస్పూను బియ్యప్పిండి పేస్టుని రాయాలి. తరువాత కొద్దిగా మైదాను చల్లాలి. ● ఇప్పుడు చపాతీని మడతలు వేయాలి. ఒక్కో మడతకు టీ స్పూను బియ్యప్పిండి పేస్టు, కొద్దిగా మైదాను చల్లుకుంటూ చపాతీ మొత్తాన్ని మడత వేయాలి. ● పూర్తయ్యాక చపాతీ రోల్స్‌ను అంగుళం ముక్కలుగా కట్ చేయాలి ● ఒక్కోముక్కను గుండ్రంగా చేసి పూరీలా వత్తుకోవాలి ● మరీ పలుచగా లేదా మరీ మందంగా కాకుండా ఒక మాదిరిగా వత్తుకుని మధ్యలో చిన్న రంధ్రం చేయాలి ● ఇప్పుడు ఈ చపాతీలను సలసల కాగుతోన్న నూనెలో వేసి మీడియం మంట మీద లేత బంగారు వర్ణంలోకి మారేంత వరకు వేయిస్తే చిరోటీ రెడీ ● చిరోటీలను ఒకదానిమీద ఒకటి పేర్చి, పైన పంచదార పొడి, పిస్తా తురుము చల్లి సర్వ్ చేసుకోవాలి.